క్లుప్తంగా

నిరాశ్రయుల ర్యాలీ



ఆరిలోవలో ర్యాలీ నిర్వహిస్తున్న నిరాశ్రయ వృద్ధులు

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు ఆరిలోవ ముస్తఫా కాలనీలో అమ్మ నాన్న సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవీఎంసీ నిరాశ్రయుల వసతి గృహంలో శుక్రవారం అంతర్జాతీయ నిరాశ్రయుల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ముస్తఫా కాలనీ నుంచి బాలాజీనగర్ మీదుగా నిరాశ్రయ వృద్ధులు ర్యాలీ నిర్వహించి తిరిగి వసతి గృహానికి చేరుకున్నారు. ఈ గృహంలోని వృద్ధులు తిరిగి సొంతిళ్లకు చేరుకునే అవకాశం కలగాలని కోరుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వై.రమణ, పి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్ ఘటనపై న్యాయ విచారణకు డిమాండ్

ఏయూక్యాంపస్: మన్యం జిల్లా కురుపాం ఆశ్రమ బాలికల గిరిజన పాఠశాల హాస్టల్‌లో పచ్చకామెర్లతో ఇద్దరు బాలికలు మృతి చెందడం, 140 మంది బాలికలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ సంఘటనపై న్యాయ విచారణ జరిపించాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న నిరుపేద చిన్నారులు అనారోగ్యం పాలవడం బాధాకరమన్నారు. వీరంతా తమ ప్రతిభతో విద్యలో రాణిస్తున్నారన్నారు. ఇటువంటి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. చిన్నారులు అనారోగ్యం పాలవడానికి కారణమైన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కిరణ్మయికి ఏయూ డాక్టరేట్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని ఊరందూరు కిరణ్మయికి ఏయూ డాక్టరేట్ లభించింది. వర్సిటీ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ చేతుల మీదుగా శుక్రవారం ఆమె డాక్టరేట్ పట్టా అందుకున్నారు. విభాగ ఆచార్యుడు ప్రొఫెసర్ పి.అరుణ్‌కుమార్ మార్గదర్శకత్వంలో కిరణ్మయి పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా కిరణ్మయిని డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు అభినందించారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసీ పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

13 నుంచి ఐద్వా మహాసభలు

మల్కాపురం: ఈ నెల 13,14,15వ తేదీల్లో అనంతపురంలో జరగనున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ మహాసభల్లో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రతినిధి ఆర్.విమల పిలుపునిచ్చారు. ఐద్వా మహాసభల సందర్భంగా 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో శుక్రవారం ఆమె ఐద్వా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఐద్వా మహిళ రక్షణకు కవచంలా పని చేస్తుందన్నారు.

పాఠశాలను చుట్టుముట్టాయి..

- పెదగదిలి ఎంపీపీ స్కూల్ వద్ద ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలు
- రాత్రుళ్లు పాములు, ఆకతాయిల బెడద
- చెట్ల కొమ్మలు తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి



పాఠశాల తరగతి గదుల వైపు వాలిన రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు





పాఠశాల గోడల పక్కన పిచ్చి మొక్కలు



పెదగదిలి ప్రాథమిక పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద శ్లాబ్ పైకి చేరిన చెట్ల కొమ్మలు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అక్కడి చెట్ల కొమ్మలు చుట్టుముట్టాయి. చెట్ల కొమ్మలతోపాటు పిచ్చి మొక్కలు పేరుకుపోవడంతో పాములు, ఆకతాయిల సమస్యలు తలెత్తాయి. ఈ పాఠశాల లోపల ప్రధాన ద్వారం వద్ద నీడ కోసం వేసిన తురాయి చెట్టు కొమ్మలు ఏపుగా పెరిగాయి. అవి పాఠశాల గోడలను ఆనుకుని రెండో ఫ్లోర్ కంటే ఎత్తుకు ఎదిగాయి. పాఠశాల గేటు చిన్నది కావడంతో రాత్రి వేళ చీకట్లో ఆకతాయిలు ఈ కొమ్మలపై నుంచి సులువుగా స్కూల్ శ్లాబ్ పైకి వెళ్లి తరగతి గదుల్లోకి చేరుతున్నారు. వాటిలో మద్యం, గంజాయి తాగుతున్నారు. దీంతోపాటు రోడ్డు పక్కన చెట్ల కొమ్మలు పెరిగి పాఠశాల తరగతి గదుల వైపు వాలిపోయాయి. ఇందులో ముళ్లతో కూడిన రేగి, మునగ చెట్ల కొమ్మలు తరగతి గదుల కిటికీలను ఆనుకొని ఉన్నాయి. మునగ చెట్ల కొమ్మల నుంచి గొంగలి పురుగులు తరగతి గదుల్లోకి చేరడంతో విద్యార్థులు భయపడుతున్నారు. మరికొన్ని గోడ పక్కన పిచ్చి మొక్కలు మొలిచాయి. వీటిలో తరచూ పాములు చేరి ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల ఓ పాము తరగతి గదిలోకి చేరి హల్‌చల్ చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. చెట్ల కొమ్మలతోపాటు రోజూ మద్యం బాటిళ్లు, గంజాయి వ్యర్థాలు తొలగించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ పాఠశాలను ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి శుభ్రం చేయించాలని జీవీఎంసీ అధికారులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బాలికలతో బస్టాప్‌లు కిటకిట



జాతీయ రహదారిపై హనుమంతవాక బస్టాప్ వద్ద వేచి ఉన్న విద్యార్థినులు

ఆరిలోవ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేసిన నాటి నుంచి బస్టాప్‌లు బాలికలతో కిటకిటలాడుతున్నాయి. నగరంలో అన్ని చోట్లా ఇదే పరిస్థితి. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో బస్టాపులు మరింత రద్దీగా మారుతున్నాయి. సాధారణంగా దూరంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు ఉచిత బస్ పాస్‌లతో బస్సుల్లో ఇంటి నుంచి వెళ్లి వస్తుండేవారు. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీల్లో చదువుతున్న బాలికలు ఆయా విద్యా సంస్థలకు చెందిన బస్‌ల్లో వెళ్తుండేవారు. ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ప్రైవేట్ విద్యా సంస్థల బస్సులు ఖాళీ అవుతున్నాయి. ఏడాదికి దూరాన్ని బట్టి రూ.వేలల్లో బస్ ఫీజులు కట్టాల్సి రావడంతో ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. పుస్తకాల బ్యాగులతో ఉదయం బస్టాప్‌ల వద్దకు చేరిపోతున్నారు. ప్రతి స్టాప్ వద్ద వందల మంది బాలికలు బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. తిరిగి సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టే సమయంలో కూడా ఇదే పరిస్థితి. దీంతో సాధారణ ప్రయాణికులతోపాటు బాలికలతో బస్టాప్‌లు కిటకిటలాడుతున్నాయి. జాతీయ రహదారిపై మద్దిలపాలెం, ఇసుకతోట, హనుమంతవాక బస్టాప్‌ల్లో రోజూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

సమయం దాటి విద్యాలయాలకు..

ఉదయం వేళల్లో విద్యా సంస్థలకు చేరుకోడానికి బస్టాప్‌ల వద్దకు వెళ్లే సరికే బస్సులు జనంతో నిండిపోయి వస్తున్నాయి. ఎక్కువ విద్యా సంస్థలు మధురవాడ, కొమ్మాది, తగరపువలస ప్రాంతాల్లో ఉన్నాయి. వాటికి చేరాల్సిన విద్యార్థినులు ఇసుకతోట, హనుమంతవాక వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. అప్పటికే ప్రయాణికులతో నిండిన బస్సులు రావడంతో రద్దీగా ఉన్న వాటిలో ఎక్కడానికి బాలికలకు వీలుపడటం లేదు. దీంతో కొంత సమయం తర్వాత వచ్చే బస్సులు ఎక్కి విద్యా సంస్థకు చేరుకునే సరికి సమయం గడిచిపోతోంది. దీంతో సమయానికి విద్యాలయాలకు చేరుకోలేక క్రమశిక్షణ తప్పుతున్నారు. ఆలస్యంగా తరగతులకు చేరుతున్నట్లు విద్యా సంస్థల్లో ఆయా బాలికలకు ముద్రపడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మధురవాడ, కొమ్మాది, తగరపువలస వైపు వెళ్లే బస్సులను మరింత ఎక్కువ సంఖ్యలో పెంచాలని బాలికలు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

శ్మశానవాటికలో శుభ్రతా కార్యక్రమాలు



శ్మశానవాటికను శుభ్రం చేయిస్తున్న గ్రామ సంఘాల సభ్యులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు పాత వెంకోజీపాలెంలోని శ్రీ సీతారామ సేవా సంఘం, గ్రామ సేవా సంఘాలు ఉపయోగించే శ్మశాన వాటికలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తా చెదారాన్ని జేసీబీతో శుక్రవారం తొలగించారు. మృతదేహాలను తీసుకెళ్లేటప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నందున శ్రీ సీతారామ సేవా సంఘం, గ్రామ సేవా సంఘాల సభ్యులు శ్మశాన వాటికను శుభ్రం చేయించారు. అదే విధంగా శ్మశాన వాటికలో మరమ్మతుకు గురైన బోరు బావి స్థానంలో కొత్త బోర్ బావిని స్థానిక కార్పొరేటర్ సహాయంతో తీయించారు. గ్రామ సేవా సంఘం అధ్యకులు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పీలా ప్రేమ్ కిరణ్ జగదీష్, శ్రీ సీతారామ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు మళ్ల పోలిరాజు, అధ్యక్షుడు సూరి అప్పారావు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుల సమస్యల పరిష్కారానికి వినతి

మద్దిలపాలెం: పీహెచ్‌సీ రెగ్యులర్ వైద్యుల సమస్యలను తక్షణమే పరిష్కరించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ బీసీ నేత మూల వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న 2800 మంది వైద్యులు వారం రోజులుగా ఆందోళన చేస్తున్నారని, దీని వల్ల గ్రామీణ, మూరుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు అందడం లేదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. గతంలో సర్వీసు డాక్టర్లకు పీజీ సీట్లలో 50 శాతం కేటాయించే వారని, దాన్ని రాష్ట్ర ప్రభుత్వం 15 శాతానికి తగ్గించిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ రంగంలో సేవలందిస్తున్న డాక్టర్లు అదనపు విద్యార్హతలు పొందడానికి స్పెషలైజేషన్ కోర్సు చదవడం ద్వారా మరింత సేవలందించే అవకాశం తగ్గిపోతుందన్నారు. ఎక్కువ మంది డాక్టర్లు ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలందించడానికి మొగ్గు చూపుతున్నారని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న డాక్టర్లకు ఈ సీట్ల కేటాయింపు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. అదే విధంగా ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు, ఏజెన్సీ ఏరియాల్లో పని చేస్తున్న వారికి అలవెన్సులు, 104లో పని చేస్తున్న డాక్టర్లకు అదనపు అలవెన్సులు ఇవ్వాలని వైద్యులు కోరుతున్నట్లు మూల వెంకటరావు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

సమాచార శాఖ నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు



సమాచార శాఖ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ నూతన డైరెక్టర్‌గా నియమితులైన ప్రస్తుత వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌ను ఆ శాఖ విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వీఎంఆర్డీఏ భవనంలోని ఆయన చాంబర్‌లో జాయింట్ డైరెక్టర్ వి. మణిరామ్, డిప్యూటీ డైరెక్టర్ కె. సదారావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించి తమ శాఖ హెచ్‌వోడీగా వస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. ఈ క్రమంలో సమాచారశాఖ కార్యకలాపాలు, అందులోని విభాగాలు, అధికారుల హోదాలు, విధులు తదితర ప్రాథమిక అంశాల గురించి డైరెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అందరూ మరింత ఉత్సాహంతో పని చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. వీఎంఆర్డీఏ కమిషనర్‌గా పని చేస్తున్న కె.ఎస్. విశ్వనాథన్‌ను సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన్ని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్‌వో శ్రీనివాసరావు, ఏవీ సూపర్‌వైజర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.

పరస్పర సహకారంతో రైల్వే ప్రాజెక్టుల వేగవంతం



సివిల్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: స్పెషల్ క్యాంపెయిన్-5లో భాగంగా శుక్రవారం దొండపర్తి డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఆర్‌ఎం లలిత్ బోహ్రా నేతృత్వంలో అమృత్ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ వినియోగదారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో డీఆర్‌ఎం మాట్లాడారు. పరస్పర సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనుల గురించి చర్చించారు. అత్యున్నత నాణ్యత, ఉన్నత ప్రమాణాలను అనుసరించి ప్రాజెక్టులను పూర్తిచేయాలని సూచించారు. ఈ నెల 31 వరకు జరిగే ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికులు, వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన) ఎ.కె.మహరాణా పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నియంత్రణ



నరసింహనగర్‌లో దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కోట్ని శ్రీనివాసరావు

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు అన్నారు. 26, 43 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం, నరసింహనగర్, నరేంద్రనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే అమలు తీరును ఆయన పరిశీలించారు. ఏఎన్‌ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజు లు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 20 దరఖాస్తులు

మద్దిలపాలెం: ఐసీడీఎస్ అర్బన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల నియామకానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. నగరంలో 2 కార్యకర్తల పోస్టులు, 21 ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. రెండు కార్యకర్తల పోస్టులకు సంబంధించి శుక్రవారం సాయంత్రంతో గడువు ముగిసింది. కార్యకర్తల పోస్టులకు మొత్తం 20 దరఖాస్తులు వచ్చినట్టు అర్బన్ సీడీపీవో నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం నుంచి 13, మద్దిలపాలెం నుంచి 7 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. తదుపరి ప్రక్రియ ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న యూజీడీ కార్మికులు

బీచ్‌రోడ్డు: తమ సమస్యలు పరిష్కరించాలని యూజీడీ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు టి. నూకరాజు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఇ. ఆదినారాయణ మాట్లాడుతూ జీవో 36 ప్రకారం కార్మికులందరికీ ఒకేలా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే 315 మంది కార్మికులకు అరియర్స్ చెల్లించాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. కార్మికుల పేరిట పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయించి న్యాయం చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే మరో సమ్మెకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సతీష్, సింహాచలం, నరేష్, అంజి, సన్నిబాబు, రాంబాబు, సాయి, సత్యం, సీతంనాయుడు, మహేష్, లక్ష్మి, వెంకటేష్, అప్పలరాజు, గణపతి తదితరులు పాల్గొన్నారు

నవంబర్ 5న జర్నలిస్టుల ఫెడరేషన్ సేవా కార్యక్రమాలు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నవంబర్ 5న పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబర్ 5న రోటరీ సహకారంతో రక్తదాన శిబిరంతోపాటు మరికొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆయా ప్రాంతాల వారీగా మంత్రులకు మరోసారి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం



ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ప్రతి వ్యక్తి మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏయూ సైకాలజీ విభాగంలో నిర్వహించిన ఒక రోజు సింపోజియంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది మానసిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వీటిని అధిగమించడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్స విధానాలు, సాంకేతికతలను పూర్తిస్థాయిలో ఉపయోగించాలని సూచించారు. సైకాలజీ విభాగాధిపతి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ దేశంలో మానసిక ఆరోగ్య సమస్యలు గణనీయంగా పెరుగుతున్నాయని, ఇవి ఎంతో ప్రమాదకరంగా మారుతాయని చెప్పారు. ఆధిపత్యం కోసం విభిన్న దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు ప్రజల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. కోవిడ్ విపత్తు సంభవించిన సమయంలో మరణాల సంఖ్య అధికంగా ఉండటానికి మానసిక ఆరోగ్యం క్షీణించడం ప్రధాన కారణమని ప్రస్తావించారు.

పాజిటివ్‌గా జీవించాలి

మహారాణిపేట: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత వివరించి విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను వివరించారు. పాజిటివ్ మానసిక ఆలోచనలతో జీవనం గడపాలని, మానసిక రుగ్మతల విషయంలో ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, మానసిక నిపుణురాలు డాక్టర్ నిత్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా దుర్గాదేవి సారె ఊరేగింపు



మూలపాలెంలో అమ్మవారి సారె ఊరేగిస్తున్న మహిళా భక్తులు

ఎంవీపీకాలనీ: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అప్పుఘర్‌లోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి సారె ఊరేగింపు వైభవంగా జరిగింది. శ్రీ జైదుర్గా బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక మూలపాలెం మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ రకాల పండ్లు, స్వీట్లు, పూజా సామగ్రిని అమ్మవారికి సమర్పించారు. మూలపాలెంలోని పురవీధుల్లో సారె ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్, పలువురు అసోసియేషన్ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గార్డెన్ కార్మికుల తొలగింపు అన్యాయం



కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గార్డెన్ కార్మికులు

సీతంపేట: వీఎంఆర్‌డీఏ పార్కుల్లో అక్రమంగా తొలగించిన గార్డెన్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సెంట్రల్ పార్క్, కైలాసగిరి, వీఎంఆర్‌డీఏ పార్క్, తెన్నేటి పార్కుల్లో పనిచేస్తున్న 18 మంది తోటమాలీలను డీఎఫ్‌వో అధికారి అన్యాయంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ అక్కయ్యపాలెం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రాలుగా ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కుల్లోని ఏడు సొసైటీల్లో 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కార్మిక చట్టాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్లుగా పనిచేస్తున్న 18 మంది గార్డెన్ కార్మికులను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని తప్పుబట్టారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, రిట్రెచ్‌మెంట్, గ్రాడ్యువిటీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గార్డెన్ కార్మికులు సిహెచ్.దుర్గ అప్పారావు, సింహాద్రి, రాంబాబు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా గోత్రనామార్చనలు జరిపారు. పలువురు భక్తులు తులాభారం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.